

# కొన్ని సముద్రాలు.. రెండు కళ్ళు

'అనంతకాలంనుండి అన్వేషిస్తున్నాను..

విశాల మహా సముద్రాలను.. అట్లాంటిక్‌లనూ.. పసిఫిక్‌లనూ

కాని నిన్ననే కనిపించాయి అతిలోతైన రెండు సముద్రాలు నా సమక్షంలోనే..

అవి.. నా దోసిట్లో వికసించిన నీ ముఖారవిందంలోని రెండు కళ్ళు–

తనకు ఎంతో ఇష్టమైన గజల్ అది. హైదరాబాద్‌కు చెందిన మషూర్ గజల్ గాయకుడు విఠల్‌రావు పాడుతాడది.. పాతలో లీనమైపోయి. మమేకమైపోయి. మనిషి సింపుల్.. అతి సాధారణం.. ఒక చవక రకపు లాల్చీ.. పైజామా.. అంతే.. ఒకప్పుడు నిజాం నవాబు తన గుర్రపుబండి బగ్గీని ఇంటికి పంపించి విఠల్‌రావును తన మహల్‌కు రప్పించుకుని గంటలకు గంటలు గజల్స్‌ను వినే మధుర గాయకుడు.

"ఎందుకు సర్.. మీరు మరీ ఇంత సింపుల్‌గా ఉంటారు.. కొంచెం.." అని తనడిగేవాడు.

ఆ క్షణం విఠల్‌రావుగారు.. తలెత్తి.. తనవైపు చూచే చూపు.. నిప్పులా కాల్చేది.. అనేవాడు.. "బేటా.. ఈ పటాటోపాలన్నీ ఒట్టి బూటకం బిడ్డా.. వచ్చేటప్పుడు మన వెంట రానివీ.. వెళ్ళేటప్పుడూ మనవెంట రానివీ.. చోడ్ దో ఏ సబ్.. అతీత్

హౌజావ్.. గెట్ లిబరేటెడ్..” తర్వాత ఒట్టి మౌనం. వెంటనే మళ్ళీ తనదైన ఒక మధుర మహోన్నత గజల్ ప్రపంచంలోకి నిష్క్రమించేవాడు. భౌతికంగా ఉంటాం.. కాని అభౌతికంగా మనదైన మనకు ఆత్మసంతృప్తినిచ్చే ఒకానొక జీవవ్యాపకంలో మనం సమాధియైపోయి జీవిస్తాం. అది జీవైక్య పారమార్థిక స్థితి.. అని చెప్పేవాడు. యోగి అతను.

నిన్న రాత్రంతా హైదరాబాద్‌లోని తను కిరాయికుంటున్న డాబా టెర్రస్‌పై.. చాపమీద వెల్లగిలా పడుకుని ఇంకా రాని చంద్రునికోసం నిరీక్షిస్తూ.. నీలాకాశంలోకి చూస్తూ చూస్తూ.. అదే గజలదే పునః పునః మననం.. తదియ.. చంద్రుడెక్కడున్నాడో.. లా పతా.

జీవితమంతే.. లోపల అగ్నిలా ఆత్మో.. హృదయమో.. ప్రజ్వలించే ఆత్మాంతర జీవమో.. గుప్తంగా.. అజ్ఞాతంగా.. రహస్యంగా దాగిఉంటుంది.. కాని బయటి ప్రపంచానికది అస్సలే కనబడక.. ఒక నిప్పుకణికలా.. మిణుకు మిణుకు. కాలుస్తూ.. ప్రకాశిస్తూ.. వెలుగుతూ.. అప్పుడప్పుడు దహించబడ్తూ,

మనిషి దహించబడ్తాడు.. లోపలినుండీ.. బయటినుండీ కూడా.

కాపాడుకోవాలి మనిషి తననుతాను.. ఈ దహించే అగ్నినుండి.. ముంచెత్తే సకల సామాజిక కాలుష్యాలనుండి.. కోరికలుగా, వ్యామోహాలుగా, బలహీనతలుగా ప్రతిక్షణం దాడిచేసే రుగ్మతలనుండీ.,

ఆటో.. ఆ ఏడుగంటల రాత్రి వేగంగా వచ్చి.. వచ్చి వరంగల్లు నగరం.. హంటర్ రోడ్‌లోని.. ఆ పేద్ద ప్లాస్టిక్ కాగితాలతో నిర్మించిన షెడ్డు ముందాగింది.. హైదరాబాద్ నుండి బస్సులో దిగి వస్తూండగా ఆటోలోనుండి చాలా పరిశీలనగా చూశాడు తను.. కాకతీయ మెడికల్ కాలేజ్ నుండి ఎంజిఎం మూలవరకు.. అన్నీ క్రిక్కిరిసిన గణనాథుల విగ్రహాలే.. పెద్దవి వరుసగా.. చాలా పెద్దవి.. మామూలు సైజ్‌వి.. చిన్నవి. కొన్నింటిపై ప్లాస్టిక్ కాగితాలను కప్పి.. ఎవ్రీ థింగ్ ఈజ్ ఫర్ సేల్.

ప్రతి విగ్రహమూ అమ్మబడును. ఎవరికి.. ఎంతకు.. ఎప్పుడు.. అమ్మబడును.

జవాబేమిటంటే.. ఎవరికైనా.. ఎంతకో ఒకంతకు.. ఈ రోజో.. కనీసం రేపు ఉదయం పదిగంటలవరకో తప్పకుండా అమ్మబడును. విగ్రహాల రేట్ ఈ క్షణం నుండి అప్ ట్రెండ్.. పైపైకి. ఉదయం.. వినాయక చవితి పండుగ..

జనం ఎగబడి విరగబడి కొనుక్కుపోతారు గణనాథుని విగ్రహాలను. పది దాటిందంటే.. అంతే.. పటం మారిపోతుంది.. విగ్రహాల విలువలు.. పడిపోతాయి. థింగ్స్ ఒికం పెరిషబుల్.. విగ్రహాలు మురిగిపోతాయి.. పనికిరాని వస్తువెప్పుడూ మురిగిపోయినట్టే లెఖ్ఖ. ఏదైనా విగ్రహం అమ్మకుండా మిగిలిపోతే దాన్ని మళ్ళీ రాబోయే సంవత్సరందాకా కాపాడాలి.. లేదా ధ్వంసం చేసి పారేయాలి. పరిస్థితి.. డు ఆర్ డై.. అంతే.. అప్పటికే ఆకాశం దట్టంగా మబ్బుపట్టి ఉంది తను వస్తూండగా. ఏ క్షణమైనా కుండపోతగా వర్షం కురిసి నగరాన్ని ముంచేస్తుం దేమోనని భయం. ఏడాదంతా కష్టపడి.. ఎక్కడెక్కడో అప్పులు చేసి తెచ్చి పెట్టిన పెట్టుబడి.. అంతా నీటిపాలై.

రిస్క్.. ఈ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ బొమ్మల తయారీ వ్యాపారమే నిరంతరమైన రిస్క్.. తెలుసు తనవాళ్ళందరికీ.. కాని తప్పదు.. ఎందుకంటే తమకు తెలిసిన బ్రతుకుదెరువు విద్య అదొక్కటే.

ఒక వస్తువును తయారుచేయడం.. దాన్ని అమ్మడం.. ఒక నేతగాడు అద్భుతంగా చీరలని నేయడం.. తన పెళ్ళాం, పిల్లలక్కూడా కాదని బయటివాళ్ళకే అమ్మడం.. కంసాలీ అంతే.. అందమైన నగలను కూలికోసం తయారుచేయడం అమ్మడం. శిల్పీ అంతే కలకాలం నిలిచిఉండే శిల్పాలను అతిసుందరంగా మలచి, జీవం పోసి.. ఎవరెవరికో అమ్మడం.. ప్రభుత్వాలూ అంతే.. ఈ దేశపు యువకులను ఐఐటిలలో.. ఇతర ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్లలో తయారుచేయడం.. విదేశాలకు సరుకు వలె అమ్మడం. అంతా వినిమయ సంస్కృతి. మేక్ అండ్ సెల్.

టైం చూచుకున్నాడు ఇరవై ఆరేళ్ళ కేశవ్ పాండే.

ఆరూ పది.

అతని మనసు ఆందోళన పడింది.. మధ్యాహ్నం ఒంటిగంటకే రావాల్సిన తనకు బాగా లేటయ్యింది. అక్కడ హైదరాబాద్‌లో ఏమీ చేయలేని నిస్సహాయత. ఒక ఇంటర్నేషనల్ సమస్య.. ఆన్ లైన్‌లో.

ఎప్పుడు కూడా.. జీవితంలో అమ్ముతున్నవాడు కొంటున్నవాడికి లోకువ. కొంటున్నవాడు తన ఇష్టాఇష్టాలనూ, కోరికలనూ, అదనపు సౌలభ్యాలనూ అమ్మేవాడి నుండి పిండి పొందుతూ.. శాసిస్తాడు. అమ్మేవాడు అనివార్యమై తల వంచి లొంగిపోతాడు చాలా సందర్భాల్లో. ఇక్కడదే జరుగబోతోంది. ఆ బట్టలవర్తక

సంఘంవాళ్ళు రెండు గంటలనుండి ఏ పది ఫోన్లు చేశారో. పరమేశ్వర్.. "ఏమయ్యిందయ్యా.. ఒక దిక్కు ఆరయ్యింది. నేను ఇంతకుముందే మీ అడ్డాకు వెళ్ళొచ్చిన. మా ముప్పయ్యయిదు అడుగుల వినాయకుడు.. నగ్నంగా.. ఒంటిమీద ఏ అలంకరణా లేకుండా ఇంకా అలాగే ఉన్నాడు.. నువ్వెప్పుడొస్తావు.. ఎప్పుడు ఆ బరిబాత వినాయకుడికి బట్టలు తొడుగుతావు.. ఊ.. మిస్టర్ పాండే.. నిన్ను చూచిగదా ఇంత పెద్ద.. లక్షరూపాయల విలువైన విగ్రహ బ్యారాన్ని మీ నాన్నకు అప్పజెప్పాను.. ఒక దిక్కు వర్షం ముంచుకొచ్చేట్టుంది.. "చెప్పుకు పోతూనే ఉన్నాడు గడగడా. పూర్తి ఆందోళనగా ఉందతని గొంతు. బట్టలవర్తక సంఘానికి అతడు కార్యదర్శి.

"సర్ మీరేమీ ఆందోళన పడకండి. నేనొచ్చేశాను. ఇప్పుడు ఎంజిఎం దగ్గరున్నా. ఐ విల్ టేక్ కేర్.."

"రేపు ఉదయం ఎనిమిది గంటలకే మా స్పెషల్ క్రేన్‌తో కూడిన లారీ వస్తుంది మీ షెడ్ దగ్గరకు.. ఇక మీ ఇష్టం." పెట్టిసిండు ఫోన్. అసంతృప్తి ధ్వనించిందతని గొంతులో.

కేశవ్ పాండే అనే తనక్కూడా ఒక్క క్షణం భయమేసింది. ఈ వర్షం వాతావరణంలో.. తేమ తేమ అంతా.. తాను నాలుగ్గంటలు ఆలస్యంగా వస్తున్నాడు.. పని పూర్తవుతుందా?

రాంజైస్వాల్.. ప్రమీలమ్మ జ్ఞాపకమొచ్చారు పాండేకు.

ఇరవై మూడేళ్ల క్రితం.. తనను తీసుకుని రాజస్థాన్ నుండి వచ్చారు వాళ్ళు వలస. అప్పుడు తనకు మూడేళ్లట. జైస్వాల్ చెప్పగా విన్నాడు.

"ఆఖిర్ మై హూ కౌన్?" అని అడుగుతాడు అప్పుడప్పుడు వాళ్లను తను.. చికాగ్గా ఉన్నపుడు.

"అరే బేటా.. ఆ ప్రశ్నను రాముడు వశిష్టున్నడిగాడు.. ఏమి చెప్పగలిగా డతడు.. చెప్పలేదు.. ఎందుకంటే.. ఎవరు ఎవరో ఎవరికీ తెలియదు కాబట్టి. మాక్కుడా నువ్వెవరో తెలియదు.. కదా ప్రమీలమ్మా" అని నవ్వేవాడు పకపకా.

అమ్మ.. ప్రమీలమ్మ కూడా పకపకా నవ్వుతూ.. "ఎవరివైతే నీకేమిటిరా.. తూతో హమారా బేటా హై.. హైనా." అని తనను దగ్గరికి ఒళ్ళోకి తీసుకుని.. జుట్టులోకి వ్రేళ్లను జొనిపి.. గుండెలకు హత్తుకునేది.

"నిన్ను ఎవరు కన్నారో నా బిడ్డా.. ఆ దేవుడే ఆ రోజు ఉదయపూర్ రైల్వే ప్లాట్‌ఫారంపై నిన్ను ఒక వరంగా మాకిచ్చి సాదుకొమ్మన్నాడు.. అప్పటినుండి.. ఇదే బతుకు.. అనేక ప్రాంతాలు.. మధ్యప్రదేశ్.. తమిళ్ నాడు.. ఆంధ్రా.. కాకినాడ.. తర్వాత హైదరాబాద్.. గత పన్నెండేళ్ళుగా వరంగల్లు. ఎన్ని ప్రాంతాలు తిరిగామో.. ద్రిమ్మరులం మనం. వలసలు.. కడుపు చేతబట్టుకుని పట్టణాలకు పట్టణాలు.. నగరాలకు నగరాలు.. ఎందరో మనుషులు.. ఎన్నో భాషలు.. ఎన్నో అలవాట్లు. అసలు నిజానికి మనలో ఎవరికీ మనమెవ్వరమో తెలియదు.. ఒక్కటి మాత్రం నాకుగానీ.. నీ నాన్నకుగానీ చాలా స్పష్టంగా తెలుసు. మనం నిజమైన మనుషులం. నికార్సయిన మనుషులం.. అని."

అమ్మ.. ప్రమీల అలా అన్న ఆ వర్షం కురుస్తున్న రాత్రి పెట్రోమాక్స్ లైట్ వెలుగులో ఆమె ముఖంలోకి చూశాడు తను. అప్పుడామె.. తాము తయారుచేసే భద్రకాళీదేవి విగ్రహం ముఖంలో ఉట్టిపడే కరుణామయమైన కాంతి కనిపించింది.

నాన్న.. రాంజైస్వాల్ అన్నాడు.. "మనం ఎవ్వరికి పుట్టామన్నది ముఖ్యం కాదు కొడుకా.. మనం ఎలా జీవించి మన మానవజాతికి ఏం ఉపకారం చేశామన్నది ముఖ్యం" అని.

"మనవి.. ఏ పూట కా పూట బతుకులు. ఎవ్వరికీ హాని చేయకుండా గడిచే సాదాసీదా బతుకులు.. వీటిని మనకు మనమే ఉద్ధరించుకుని బాగుచేసు కోవాలె.. ఐతే.. ఒక్క విషయం జ్ఞాపకముంచుకోవాలె మనం. .జన్మతహః మనందరం కళాకారులం.. చిన్నప్పటినుండీ.. ఒకరినొకరం చూచుకుంటూ.. గమనిస్తూ.. నేర్చుకుంటూ.. అతి సూక్ష్మమైన విగ్రహాల రుపాలను దిద్దుతూ దిద్దుతూ ఎలా ఆకర్షణీయంగా, హృదయాలకు హత్తుకునే రీతిలో మలచగలమో తెలుసు కున్నాము. ఇప్పుడు మనను మనం ఎలా తీర్చిదిద్దుకోవాలో ఇక ఆలోచించాలె" అని ఆ వర్షం జోరుగా కురుస్తున్న నాటి రాత్రి ప్రతిపాదించాడు నాన్న.

ఆ సమావేశం అతి కీలకమైంది. అప్పటికి ఈ బొమ్మల తయారీ మనుషులు మొత్తం ఓ పద్దెనిమిదిమంది ఉండేవాళ్ళూ.. ఒక కుటుంబంగా.. ఎక్కడెక్కడినుండో వచ్చి ఒక చోట కూటమిగా ఏర్పడ్డవాళ్ళు.. సరిగ్గా ఆ రాత్రే తను ఒక ముఖ్యమైన ప్రతిపాదన చేశాడు.. దానికి అందరూ ఎంతో సంతోషంగా జేజేలు పలికారు.. తర్వాత అందరూ.. తన ఆ ప్రతిపాదనకు అంగీకారం తెలిపి.. ఇక ఆ దిశలోనే.. ఆలోచించడం మొదలెట్టారు.

ఒక ఏడాది గడిచింది.. తర్జనభర్జన జరిగి ఒక స్పష్టమైన.. 'సూర్యుడు ప్రతిదినం ఉదయించును.. ప్రతి సాయంత్రం అస్తమించును..తప్పదు..తప్పదుగాక తప్పదు..' వంటి చాలా సహజ కఠోర నిర్ణయం తీసుకోవడం. ఫలితంగా తన ఏడవ ఏట ఒక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శిశు తరగతిలో ప్రవేశించడం.. చేతిలో పలకా బలపంతో. పంతులు మొట్టమొదట పలకపై 'అ' అన్న అక్షరాన్ని దిద్దిపిస్తే దాన్ని క్షణంలో ఉన్నదున్నట్టు దిద్ది చూపించి తను అందరినీ అశ్చర్య పర్చాడు. అసలు జరిగిందేమిటంటే.. వాళ్ళదృష్టిలో అక్షరాలన్నీ అక్షరాలే. కాని తన దృష్టిలో అవన్నీ చిన్న చిన్న బొమ్మలు. విగ్రహాలకు కనులూ.. పెదవులూ.. చెవులూ. బొట్టూ.. ఆభరణాలూ.. చేతులకూ.. కాళ్ళకూ అనేకానేక అలంకారాలు అలవోకగా క్షణాల్లో చేసే తనకు.. ఆ అక్షరమాలను నేర్చుకోవడం ఒక అవలీలమైన విషయమైపోయింది.

అప్పుడు తమ కూటమిలో దాదాపు ఐదారుగురు పిల్లలుండేవారు. ముగ్గురు ఆడ.. ముగ్గురు మగ. పిల్లలందరూ విధిగా బడికి పోవాలి. ప్రతిరోజూ ప్రతి పిల్లవాడూ.. పిల్లా.. విధిగా బడికిపోయి రాగానే కనీసం ఒక గంటైనా పెద్దవాళ్ళు తయారుచేసే బొమ్మలకు పెయింటింగ్ పని.. అంటే కళ్ళూ.. చెవులూ.. ఇతర అలంకారాలు చేయాలి. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ముద్దలను కలుపుడూ.. మోల్డింగ్స్.. అచ్చులు.. సరిగా ఎండబెట్టుట.. అవీ చేయాలి. మొదట్లో ఆడా మగా.. అందరికీ ప్రతిరాత్రీ సారాయో.. చీప్ లిక్కరో తాగే అలవాటుండేది. క్రమక్రమంగా ఆ అలవాటును తగ్గించుకుని.. మద్యానికి పూర్తిగా దూరమవ్వాలన్న సమిష్టి నిర్ణయాన్ని గౌరవిస్తూ.. మొదట ఆడవాళ్ళు తాగడం మానేశారు. ఇక అక్కడినుండి ఈ సంచార కుటుంబాల్లో ఒక పెద్ద పెను విప్లవం మొదలైంది.

పాండేకు క్రమక్రమంగా అర్థమైన విషయమేమిటంటే.. మగవాళ్ళకంటే తమ ఆడవాళ్ళలోనే సృజనాత్మకత.. కళాత్మక దృష్టీ.. నైపుణ్యం ఎక్కువని. బొమ్మలను చేస్తున్నపుడు మగవాళ్ళు చేసే పదార్థ వ్యర్థం కంటే ఆడవాళ్ళు చేసే మెటీరియల్ వేస్టేజ్ చాలా తక్కువ. పనిచేసే వేగం చాలా ఎక్కువ. కాగా బొమ్మల తుదిరూపం కూడా వాళ్ళవి ఆకర్షణీయంగా ఉండి.. తొందరగా అమ్ముడుపోతాయి. అప్పటిదాకా శివనగర్.. ఫోర్ట్ రోడ్ పరిసరాల్లో ఊర్కే ఖాళీగా ఉండే కాంపౌండ్ స్థలాల్లో బొమ్మలను తయారు చేయడం.. క్రమక్రమంగా పెరిగి ఇప్పుడు.. నాల్గు అడ్డాలు. ఈ రెండుగాక.. హంటర్ రోడ్‌లోని మరో రెండు షెడ్లు.

తను ఇంటర్ పూర్తి చేసేనాటికి.. ఈ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ బొమ్మల తయారీ రంగంలోనే ఒక పెనుమార్పు తెచ్చాడు. ఈ రంగంలో.. ఎక్కువమంది స్థానికులు కారు. చాలామంది రాజస్థాన్ నుండి వలసవచ్చినవాళ్ళే. ఐతే.. పెద్ద బొమ్మలకు ఆర్డర్స్ తీసుకుని.. ఇనుప చట్రాలతో స్ట్రక్చర్ చేయించి వాటిపై పోతపోయడం.. పెయింట్‌కు ఎక్కువగా బ్రష్‌లు కాకుండా స్ప్రే గన్స్ వాడడం. పెయింట్ మిక్సింగ్ రహస్యాలను కనుక్కోవడం.. వరంగల్లు నుండి.. ప్రక్కనున్న మూడు నాలుగు జిల్లాలకు బొమ్మలను సరఫరా చేయడం.. తను బిటెక్‌లో చేరాడు.. పనుల్లో ఆధునికీకరణ.. అప్పటివరకు తమ పద్దెనిమిది మంది మనుషులు అప్పటిదాకా ఏడాదికి రెండువేల బొమ్మలను చేయగలిగితే.. ఇప్పుడు ఈ టీం తయారుచేసి అమ్మగల బొమ్మల సంఖ్య ఎనిమిదివేలు. గణపతి పండుగకు వినాయకుని విగ్రహాలు.. మేజర్ మార్కెట్.. ఇవే ఆరున్నర వేలు తయారీ. ఖమ్మంకు వేయిన్నర, కరీంనగర్.. వేయిన్నర. నిజామాబాద్ వేయిన్నర. వరంగల్లులో మిగతావన్నీ. ఐతే పెద్దసైజ్ విగ్రహాల్లో రిస్క్ ఉన్నా లాభం ఎక్కువ. కాబట్టి అవన్నీ సైంటిఫిక్ పద్ధతుల్లో తనే స్వయంగా పర్యవేక్షిస్తూ.. ఒక సంప్రదాయాన్ని స్థిరపర్చాడు. తనతోపాటు చదువుకున్న జ్యోతీ సింగ్ మార్కెటింగ్ చూస్తాడు. ఎందుకోగాని.. ఈ బొమ్మల మార్కెటింగ్‌లో సిక్కుల యువకులే అధికంగా స్థిరపడ్డారు. అందుకే తమ జ్యోతీ సింగ్ డీల్ చేస్తాడు ఆ అమ్మకాల రంగాన్ని.. రజని డిగ్రీ చేస్తోంది.. ఆమె బొమ్మల మాన్యుఫాక్చరింగ్ చూస్తుంది.. స్త్రీ కాబట్టి మినిమం మెటీరియల్ వేస్టేజ్‌తో పర్యవేక్షించేది. కాగా ఆమె చక్కని ఆర్టిస్ట్. బ్రష్ పట్టిందంటే.. బొమ్మ ప్రాణం పోసుకుంటుంది.

తను బిటెక్‌లో చేరగానే.. ఒక విషయంగా అద్భుతమైన జ్ఞానోదయమైంది. వరంగల్లులో ఉన్న చాలా ఇంజనీరింగ్ కాలేజీల్లో తొంభై శాతం కాలేజీలు దిక్కుమాలినవే. దేనిలోనూ ఎవడూ పాఠం చెప్పడు. వాళ్ళకు ప్రభుత్వ ఫీజ్ రీ ఎంబర్స్‌మెంట్ కావాలి.. ప్రతి విద్యార్థికి ముప్పై ఐదువేలు ప్రభుత్వమిచ్చేది.. సంవత్సరానికి. పంతుల్లందరూ డర్టీ. ఒక్కొక్కడికి ఎనిమిది వేల జీతం.. పొట్ట కోసినా ఒక్క అక్షరం రాదు. బిటెక్ పూర్తయిన పిల్లలు మళ్ళీ బిటెక్ విద్యార్థులకు పంతుళ్ళు. పరీక్షలు.. మార్కులు.. డిస్టింక్షన్‌లు అన్నీ బోగస్. ఫేక్.. అంతా.

కాబట్టి.. అర్థమైందేమిటంటే.. చదువును నిజంగా నేర్చుకోవాలంటే.. మనమే స్వయంగా పుస్తకాలను తెచ్చుకుని కుస్తీపట్టి.. ఆపోశనపట్టి నేర్చుకోవాలి. స్వయం

అధ్యయనం.. స్వయంవిశ్లేషణ.. స్వయం సందేహ నివృత్తి.. అన్వేషణ.. శోధన.

నిజానికి .. చదువుకోవాలనే నిజమైన దాహం మనిషికి ఒక మత్తు.. నిషా.. ఒక ఎడతెగని తృష్ణ..ఆ చదువు రుచి తనను పట్టుకుంది.

గత నెల తను వరంగల్లు వచ్చినపుడు.. ఒక కార్పొరేట్ కంపనీలో ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్ పెట్టినట్టు పెట్టాడు తను తమ పద్దెనిమిది మంది సభ్యులతో. చదువుకున్న తమ ఐదుగురిలో ఒకరిప్పుడు బి.కాం, ఒకరు ఎం.ఎ., ఒకడు డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్. ఒకామె..జ్యోతి బి.ఎస్సీ. కేశవ్ పాండే.. అనే తను.. ఎం.టెక్.. మెకానికల్ ఇంజనీరింగ్ ఇన్ డిస్టింక్షన్.. స్పెషలిస్ట్ ఇన్ డిజైన్స్ ఆఫ్ ఇంజక్షన్ మౌల్డింగ్ సిస్టమ్స్.

తమ యువక బృందమంతా ఎప్పుడూ కలిసినా తీర్మానించుకుంటూ.. అనుకునేదేమిటంటే.. "చదువే మనను ధైర్యవంతుల్ని చేసింది. చదువే మనకు స్థైర్యాన్నిచ్చింది.. తెలివినిచ్చింది.. అంతిమంగా జీవితాన్నిచ్చింది." అని.

❄ ❄ ❄

అనుకున్నట్టుగానే వర్షం మొదలైంది.. కుండపోతగా.

పాండే ఆటో.. జెమినీ టాకీస్.. మూల తిరిగి.. పోతన విజ్ఞానకేంద్రం.. విద్యుత్ సబ్ స్టేషన్.. పరుగెత్తుతోంది.

ఒక కల్యాణ మండపం.. ఫంక్షన్ హాల్.. ప్రక్కనే పెట్రోల్ బంక్.. అటు ప్రక్క ఎత్తుగా.. ఆకుపచ్చ ప్లాస్టిక్ డేరాలను కట్టిన రెండు షెడ్లు.

ఆటో దిగి.. హడావిడిగా.. ఆందోళనగా లోపలికి పరుగెత్తాడు కేశవ్ పాండే. అందరూ తలలు తిప్పి చూశారు.. కాని ఏ ఒక్కరూ పాండే దగ్గరికి రాలేదు.. అందరూ చేతుల్లో బ్రష్‌లతో.. పెయింట్ స్ప్రే గన్‌లతో పనిలో ఉన్నారు. ఒక్క ప్రమీలమ్మ మాత్రమే వచ్చింది.. "తూ ఆగయే బేటా.. భీగ్ గయా పానీమే.. ఆవో అందర్.." అని వచ్చి పూర్తిగా తడిచిన పాండే నుదుటిని ముద్దాడి.. కళ్ళలోకి చూచింది. ఆమె కుడిచేతిలో ఒక సన్నని బ్రష్ ఉంది.. ఆమె ముఖ్యంగా విగ్రహాల ముఖాలపై కనురెప్పలనూ.. పెదవులనూ.. నుదుటిపై తిలకాలను.. కళ్ళలో ప్రతిఫలించే దయార్ద్ర దృక్కులనూ చిత్రిస్తుంది.

ఎదుట.. ఎత్తుగా.. ముప్పై ఐదు అడుగుల ఎత్తులో.. ఇనుప చట్రంలో పోతపోసి.. నాన్న రాం జైస్వాల్ తయారుచేసిన భారీ వినాయక విగ్రహం

కనిపిస్తోంది. అది పూర్తిగా బోసిగా ఉంది. ఇంకా బాడీ పెయింటే వేయలేదు. ఇప్పుడు వేస్తే ఆరడం కష్టం.. వర్షపు నీటి తేమలో. ఈ స్థితిని ఊహించే తెచ్చాడు తను.. తను వెంట తెచ్చిన పొడగాటి నల్లని బ్యాగ్‌ను తెరచి.. రెండు బ్లోయర్లను బయటకు తీసి.. చుట్టూ చూచి.. తనవైపే చూస్తున్న జ్యోతిని దగ్గరగా రమ్మని సైగ చేసి.. ఆమె చేతికి ఒక బ్లోయర్‌నందించి.. వాటిని స్టార్ట్ చేసి.. హాట్ బ్లోయర్స్ అవి.. వేడి గాలిని ప్రెషర్‌తో.. చిమ్ముతూ.,

అందరి ముఖాల్లోనూ.. ఒక కొత్త ఉత్సాహం.. పాండే వచ్చినందుకు.. సూర్యుడు రాగానే ఆకాశానికంతటికీ.. కొత్త జవసత్వాలొచ్చినట్టు.,

మొత్తం పదిహేనుమంది.. చేతులన్నీ మెరుపులా కదులుతూ.. పని.. పని.. పని.

పాండే.. పెద్ద వినాయకునికి ఒక గంటలో.. గులాబిరంగు పెయింట్‌ను వేశాడు.. వెంట వెంటనే బ్లోయర్తో ఆరబెడ్తూ. ముందు తలభాగం ఆరగానే.. పాండే ఐదారు కలర్స్‌ను వెంట తీసుకుని.. జూలాపైకెక్కి.. వెదురు బుట్టవంటి పలకపై కూర్చుని.. అలవాటే అతనికి.. ఎన్నోసార్లు చేశాడటువంటి సాహసోపేత పెయింటింగ్‌ను.

అరగంట తర్వాత.. మూల గణపతి.. నుదుట అద్భుతమైన ప్రకాశంతో.. ఎర్రని రంగులో.. బొట్టు మెరిసిపోతూ.. రుద్ర గణపతి.. నృత్య భంగిమలో. గంట.. మరో గంట.. ఇంకో గంట.. మొత్తం విగ్రహం.. పూర్తయ్యింది. బట్టల వర్తక సంఘం కార్యదర్శి పరమేశ్వర్ వచ్చాడు.. పాండే గమనించనేలేదు. పరమేశ్వర్ అప్రతిభుడై చూస్తున్నాడు.. ఒక మెరుపులా.. రోబట్‌లా చకచకా పనిచేసుకుపోతున్న పాండేను.

చుట్టూ అందరూ అదే ఉత్సాహంతో.. తమ ముందున్న విగ్రహాలను అలంకరిస్తూనే ఉన్నారు. పదులు.. వందలు.. అప్పుడక్కడ కనిపించేది కేవలం పని.. పని.. పని.. అంతే.

తెల్లవారుతూండగా.. వర్షం వెలిసింది. పరమేశ్వర్.. తన క్రేన్‌తోసహా ఉన్న భారీ లారీని తెప్పించాడు. దాని వెంట ఓ వందమంది కార్యకర్తలొచ్చారు.. మేళతాళాలతో. హడావిడి మొదలైంది.. ఈలలు.. కేకలు.

"గణపతి మొప్పా మోరియా.."

"జై బోలో గణేశ్ మహరాజ్ కీ."

"జై.."

"జై జై గణేశా.. జై బోలో గణేశా.."

నినాదాలు మిన్నుముడుతున్నాయి.

అప్పుడే ఎఱ్రగా సూర్యోదయం.. ఆకాశం నుదుట కుంకుమ దిద్దుకుంటున్నది.

షెడ్డు బయట.. అప్పటికే ఆర్డర్స్ ఇచ్చి నిన్నటినుండి వర్షంవల్ల భయ పడుతున్న దూరప్రాంత గిరాకులు చేరుకుంటున్నారు.

"పాండే.. మాటప్రకారం.. నాకు వేళకు అద్భుతమైన వినాయకుని విగ్రహాన్నందించి చాలా ఆనందం కలిగించినౌ భాయ్.. బహుత్ ముబారక్.. ఔర్ షుక్రియా.." ఏ లేవ్.. ఆప్కా ఏక్ లాక్ రూప్యా.. అఔ హంసే ఏ పాంచ్ హజార్ బీ లేవ్..ఖుషీసే.."

ప్రక్కన తండ్రి.. రాంజైస్వాల్ .. అమ్మ ప్రమీల కూడా ఉంది..

"పాపా లేవ్." అనగానే.. జైస్వాల్ పరమేశ్వర్ చేతిలోనుండి.. లక్షా ఐదువేల నగదు నోట్ల కట్టను తీసుకున్నాడు ముఖం నిండా నవ్వుతో.

కొద్దిసేపట్లో.. భారీ ఊరేగింపు బయలుదేరింది.. అత్యుత్సాహంగా.. వందలమందితో.. భారీ వినాయకుడు వెంటరాగా.

పాండే.. దూరమౌతున్న ఊరేగింపును ప్రశాంతంగా చూస్తుండగానే.. ఎదురుగా.. దూరంగా భద్రకాళి గుడిలోనుండి గంటల చప్పుడు వినిపించడం మొదలైంది.. మంగళకరంగా.

అప్పుడే కేశవ్ పాండే ప్యాంట్ జేబులోని మొబైల్ మ్రోగింది.. ఠ్ ఠ్ ఠ్ ఠ్.. అని.

"హలో.."

"మిస్టర్ పాండే.. మీరు వెంటనే మన కాగ్నిజెంట్ హెడాఫీస్‌లో నాల్గు గంటల్లో రిపోర్ట్ చేయాలి.. మన ఇండియన్ డిఫెన్స్ సర్వీసెస్‌తో కలిసి మనం చేస్తున్న ప్రాజెక్ట్‌లో ఏదో సమస్య వచ్చిందట.. నువ్వు వెంటనే ఈ రాత్రి లడక్ సరిహద్దు దగ్గరకు బయల్దేరి వెళ్ళాలి..ప్లీజ్.." సంభాషణ కొనసాగుతూనే ఉంది.

రాం జైస్వాల్.. తల్లి ప్రమీల.. కొడుకు పాండే దిక్కు టెన్షన్‌గా చూస్తుండగానే..

అన్నాడతను.. "అమ్మా.. మడికొండ దగ్గర.. మన పది కుటుంబాలకోసం పది పక్కా ఇండ్లను.. మన విగ్రహాల తయారీకోసం చుట్టూ ఐదెకరాల స్థలం.. తయారయ్యింది. నేను వచ్చేప్పుడే చూచివచ్చాను. వచ్చే నెలలో అక్కడికి మనందరం మారుదామామ్మా.. మన స్వంత ఇళ్ళలోకి." అని జేబులనూ.. శరీరాన్నీ తడుముకుంటూ.,

"అమ్మా.. నేను వెళ్ళాలి.. మా కంపనీ నుండి పిలుపొచ్చింది.."

"ఎందుకు బిడ్డా.. వెళ్ళడం.. ఒక్కరోజు.." ఆమె ఏదో అంటూండగానే

పాండే అన్నాడు.. "పని.. పని.. పనమ్మా.. పని చేయాలిగదమ్మా మనం. మనకోసం.. సమాజంకోసం.. ఏ కొంచెం వీలున్నా ఈ దేశంకోసం.."

పాండే ఏమంటున్నాడో ఆమెకర్థం కాలేదు.కాని..,

(Sent to Vattikota Alvaaruswamy Kathala Poti
'Sobati'-Nava Telangana..Dt : 20-09-2015)